AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
12-12-2025 (Friday)
MAIN EDITION

## కేంద్ర మాజీ మంత్రి కన్నుమూత



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్ (90) శుక్రవారం ఉదయం మృతి చెందారు. మహారాష్ట్రకు చెందిన ఆయన అనారోగ్య కారణాలతో లాతూర్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. శివరాజ్ పాటిల్ తన జీవితాంతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. కొన్నేళ్ల క్రితం నుంచి ఆయన క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన 2004 నుంచి 2008 వరకు కేంద్ర హోం మంత్రిగా, 1991 నుంచి 1996 వరకు లోక్‌సభ స్పీకర్‌గా పనిచేశారు. పంజాబ్ గవర్నర్‌గా, చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి అడ్మినిస్ట్రేటర్‌గా కూడా పనిచేశారు.

## రజనీకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపిన మోదీ




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** దేశవ్యాప్తంగా దశాబ్దాలుగా కోట్లాదిమంది అభిమానులకు ఆరాధ్య దైవంగా రజనీకాంత్ నిలిచారు. ఆయనను ఫాన్స్ తలైవాగా కొలుస్తారు. సామాన్య బస్ కండక్టర్ నుంచి ప్రపంచంలోనే అత్యధిక రెమ్యూనరేషన్ అందుకుంటున్న నటుడుగా పేరు సంపాదించుకున్న రజనీకాంత్ నేడు 75వ పుట్టిన రోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా అభిమానులు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ముఖ్యంగా ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

## ఇండిగో అధికారులపై వేటు



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ఇండిగో ఎయిర్‌లైన్స్ సంక్షోభంతో ఇటీవల అనేక విమానాలు రద్దయిన విషయం తెలిసిందే. దీంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో తాజాగా డీజీసీఏ చర్యలు చేపట్టింది. విధుల్లో నిర్లక్ష్యం వహించిన నలుగురు ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్లలను డీజీసీఏ సస్పెండ్ చేసింది.

## లాభాలతో ముగిసిన సూచీలు



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్ శుక్రవారం లాభాల బాటలో సాగింది. వరుసగా రెండో సెషన్‌లోనూ ప్రధాన సూచీలు లాభాలతో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 233 పాయింట్ల లాభంతో ప్రారంభమై మరో 231 పాయింట్లు పెరిగింది. చివరికి సెన్సెక్స్449 పాయింట్ల లాభంతో 85,267 వద్ద, నిఫ్టీ 148 పాయింట్ల లాభంతో 26,046 వద్ద స్థిరపడ్డాయి.

## ఉపాధిహామీ పథకం పేరు మార్పు



**అక్షరటుడే, ఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును 'పూజ్య బాపు గ్రామీణ్ రోజ్ గార్ యోజన'గా మార్చింది. అంతేకాకుండా ఉపాధి హామీ పథకం పనిదినాల్లోనూ మార్పు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఒక కుటుంబానికి ఏడాదికి గరిష్ఠంగా ఉన్న 100 పనిదినాలను 125 రోజులకు పెంచింది.

## లేడీ డాన్ అరుణపై పీడీ యాక్ట్

**అక్షరటుడే, ఏపీ:** ఏపీలో గత ప్రభుత్వ హయాంలో అరాచకాలు చేసిన లేడీ డాన్ అరుణపై పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. కొంతకాలంగా అరుణ నిత్యం వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఆమెపై నెల్లూరు జిల్లాలో పీడీ యాక్ట్ నమోదైంది. కోవూరు మండలం పెద్ద పడుగుపాడు కేఆర్ ఆర్ నగర్‌కు చెందిన అరుణ వైసీపీ హయాంలో అనేక నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్ విషయంలో అరుణ వ్యవహారం బయటకు వచ్చింది. శ్రీకాంత్‌తో ఓ హాస్పిటల్‌లో అరుణ ఉన్న దృశ్యాలు తీవ్ర కలకలం సృష్టించాయి. అయితే అరుణపై కోవూరు, నవాబుపేట, వేదాయపాలెం పోలీసు స్టేషన్లతో పాటు విజయవాడలో కేసులు నమోదయ్యాయి.

## గల్ఫ్ దేశాల్లో ధురంధర్ సినిమా బ్యాన్

**అక్షరటుడే, సినిమాడెస్క్:** రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన ధురంధర్ సినిమా హిట్ టాక్ తెచ్చుకుంది. భారత్‌లో మంచి వసూళ్లు రాబడుతోంది. విదేశాల్లో సైతం ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. అయితే గల్ఫ్ దేశాలు ధురంధర్ సినిమాను బ్యాన్ చేశాయి. స్పై థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ధురంధర్ మూవీకి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. అయితే ఇందులో పాకిస్థాన్ వ్యతిరేక వ్యాఖ్యలు ఉన్నాయని అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆరు గల్ఫ్ దేశాలు బ్యాన్ చేశాయి. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ నిషేధించాయి. గల్ఫ్ అంతటా థియేటర్లలో విడుదల చేయడానికి నిర్మాతలు ప్రయత్నించారు. కానీ ప్రతిచోటా అనుమతి రాలేదు.

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బీఆర్‌ఎస్ నాయకులపై విమర్శల దాడి కొనసాగిస్తున్నారు. జనంబాటలో భాగంగా జిల్లాల్లో పర్యటిస్తున్న ఆమె గులాబీ నాయకులే టార్గెట్‌గా ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పటికే పార్టీ నుంచి సస్పెండ్ అయి కుటుంబానికి సైతం కవిత దూరంగా ఉంటున్నారు. కాగా.. ఆమెపై బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు ఎక్కుపెడుతున్నారు. దీంతో ఆ పార్టీ నాయకులపై కవిత ఫైర్ అవుతున్నారు. తాజాగా ఆమె చేసిన వ్యాఖ్యలు కుటుంబానికి, ఆమెకు మధ్య గ్యాప్ మరింత పెరిగేలా ఉన్నాయి.

–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# తోలు తీస్తా..



- బీఆర్‌ఎస్ నాయకులకు కవిత స్ట్రాంగ్ వార్నింగ్
- మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు
- జనంబాటలో గులాబీ నేతలపై తీవ్ర ఆరోపణలు
- కుటుంబంతో మరింత పెరుగుతున్న అగాధం

కల్వకుంట్ల కవిత కాళేశ్వరం విషయంలో హరీశ్ రావుపై ఆరోపణలు చేయడంతో పార్టీ నుంచి సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. అనంతరం ఆమె హరీశ్‌రావు లక్ష్యంగా అనేక ఆరోపణలు చేశారు. తనను పార్టీ నుంచి, కుటుంబం నుంచి దూరం చేయాలని కుట్ర చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జాగృతి జనంబాట కార్యక్రమాన్ని కవిత చేపట్టారు. ఇందులో భాగంగా వివిధ జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఆయా జిల్లాల్లో పర్యటన సందర్భంగా కవిత కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ నేతలపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన పలు నిర్ణయాలను సైతం ఆమె విమర్శిస్తుండం గమనార్హం.

### బీఆర్‌ఎస్ ఎదురు దాడి

కవిత విమర్శలపై మొదట్లో సైలెంట్‌గా ఉన్న బీఆర్ఎస్ ఇటీవల ఎదురుదాడి ప్రారంభించింది. కేటీఆర్, హరీశ్‌రావు సహా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలపై కవిత ఆరోపణలు చేస్తున్నారు. ఆమె ఆరోపణలపై గులాబీ శ్రేణులు కౌంటర్ ఇస్తున్నాయి. కాంగ్రెస్‌తో కవిత కలిసిపోయారని పలువురు కీలక నేతలు సహా, జిల్లా నాయకులు ఆరోపిస్తున్నారు. అంతేగాకుండా ఆమె వ్యక్తిగత జీవితం, భర్త అనిల్ వ్యాపారాలపై సైతం విమర్శలు చేస్తున్నారు. ఇటీవల కూకట్‌ల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కవితపై తీవ్ర విమర్శలు చేశారు. మంత్రి పదవులు అమ్ముకున్నారని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌తో ఢిల్లీలో కేజ్రీవాల్‌ను ఆగం చేశారని, ఇప్పుడు కేసీఆర్, కేటీఆర్‌ను నాశనం చేయాలని చూస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కవిత భర్తకు బాలనగర్‌లో 36 ఎకరాల భూమి ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు.

### చిట్టా విప్పుతానని హెచ్చరిక

కూకట్‌పల్లి ఎమ్మెల్యే వ్యాఖ్యలపై కవిత శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌తో కలిసి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై ఆరోపణలు చేస్తున్నారని తనపై కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అలాంటి వారి తోలు తీస్తానని హెచ్చరించారు. తనపై అనవసరమైన దాడి చేస్తే వారి చిట్టా మొత్తం విప్పుతానని పేర్కొన్నారు. నిత్యం కేటీఆర్ వెంట ఉండే ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌ను గతంలో పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. ఆయన ఫామ్ హౌస్‌లో కోడి పందెలు నిర్వహిస్తూ దొరికిపోయారని చెప్పారు. ఎవరు ఎవర్ని కాపాడుతున్నారని ప్రశ్నించారు. పోచంపల్లి శ్రీనివాస్ ఎవరి బినామీ అని ప్రశ్నించారు.

### సీఎం అవుతా..

తనకు టైం వస్తుందని కవిత అన్నారు. ఏదో ఒక రోజు సీఎం అవుతానని చెప్పారు. తాను ముఖ్యమంత్రి అయితే 2014 నుంచి జరిగిన అన్ని విషయాలపై విచారణ చేయిస్తానని పేర్కొన్నారు. తనపై ఆరోపణలు చేసిన వారికి లీగల్ నోటీసులు పంపుతున్నట్లు పేర్కొన్నారు. తన కుటుంబ సభ్యులపై అవమానకరమైన ప్రకటనలు చేసినందుకు టీ న్యూస్, మాధవరం కృష్ణారావు, ఏలేటి మహేశ్వర్ రెడ్డిలకు లీగల్ నోటీసులు పంపించారు. వారం రోజుల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## లొంగిపోయిన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రధాన నిందితుడు, అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు శుక్రవారం ఉదయం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. బీఆర్ఎస్ హయాంలో పలువురి ఫోన్లను ట్యాప్ చేసినట్లు కేసు నమోదైన విషయం తెలిసిందే. ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో ప్రతిపక్ష నేతలు, సినీ ప్రముఖులు, వ్యాపారులు, జడ్జీల ఫోన్లను ట్యాప్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దీనిపై కేసు నమోదైంది. ఈ కేసు విచారణకు ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. ప్రభాకర్‌రావు, మరో నిందితుడు ప్రణీత్‌రావు కలిసి ఫోన్ ట్యాపింగ్ ఆధారాలు ధ్వంసం చేశారు. ప్రభాకర్ రావు అమెరికాకు పారిపోయాడు. దీనిపై సిట్ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఆయన హైదరాబాద్ తిరిగి వచ్చారు. ఆ సమయంలో న్యాయస్థానం ఆయనకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించింది.

### విచారణకు సహకరించకపోవడంతో..

అమెరికా నుంచి వచ్చిన తర్వాత ప్రభాకర్‌రావును పలుమార్లు సిట్ విచారించింది. అయితే ఆయన విచారణకు సహకరించలేదు. దీంతో అరెస్ట్‌కు అనుమతి ఇవ్వాలని గతంలోనే ప్రభుత్వం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీనిపై గురువారం వాదనలు విన్న ధర్మాసనం అరెస్ట్ నుంచి గతంలో కల్పించిన రక్షణను ఉపసంహరించుకుంది. శుక్రవారం పోలీసుల ఎదుట సరెండర్ కావాలని ఆదేశించింది. భౌతికంగా ఆయన్ని ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా చూడాలని కోర్టు పేర్కొంది. సుప్రీం ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణాధికారి ముందు సరెండర్ అయ్యారు.

## దువ్వాడ జంట బర్త్‌డే పార్టీ భగ్నం

**అక్షరటుడే, హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో ఎప్పుడూ చర్చల్లో ఉండే ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌దివ్వెల మాధురి జంట మరోసారి వివాదంలో చిక్కుకుంది. డిసెంబర్ 12న దివ్వెల మాధురి పుట్టిన రోజు కావడంతో దువ్వాడ శ్రీనివాస్ మొయినాబాద్‌లోని 'ది పెండెంట్ ఫామ్‌హౌస్'లో గ్రాండ్ పార్టీ ఏర్పాటు చేశారు. అయితే ఈ పార్టీకి ఎలాంటి అధికారిక అనుమతి లేదని, అంతేకాకుండా మద్యం మరియు మత్తు పదార్థాలు ఉన్నాయన్న సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు ఫామ్‌హౌస్‌పై దాడి చేశారు. అక్కడి నుంచి 10 విదేశీ మద్యం బాటిళ్లు, ఏడు హుక్కా పాట్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## మ్యూజియంలో భారీ దొంగతనం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బ్రిటన్‌లోని బ్రిస్టల్ నగరంలో ఉన్న మ్యూజియంలో జరిగిన దొంగతనం సంచలనం రేపింది. నగరంలోని బ్రిటిష్ ఎంపైర్ అండ్ కామన్వెల్త్ మ్యూజియంలోని అత్యంత విలువైన 600కి పైగా వస్తువులు దుండగులు అపహరించినట్లు అధికారులు తెలిపారు. ఈ అపహరణలో బ్రిటిష్ కాలంనాటి భారతీయ కళాఖండాలు కూడా ఉండడం గమనార్హం. స్థానికులకు మరియు ప్రపంచ వ్యాప్తంగా కళాసంప్రదాయాన్ని మెచ్చే వారికి ఇది తీరని నష్టం. ఈ ఘటన సెప్టెంబర్ 25న, తెల్లవారుజామున 1 నుంచి 2 గంటల మధ్య జరిగింది. దొంగతనానికి గురైన వస్తువుల్లో ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారికి చెందిన నడుము పట్టీ బకిల్, దంతంతో తయారైన బుద్ధ విగ్రహం, ఇతర అమూల్యమైన భారతీయ వస్తువులు ఉన్నాయి.




## సినిమా టికెట్ రేట్లు పెంచబోం: మంత్రి కోమటిరెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్:** సినిమా టికెట్ రేట్ల పెంపుపై తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఇక సినిమా టికెట్ల ధరలు పెంచబోమని ఆయన స్పష్టం చేశారు. బాలకృష్ణ హీరోగా తెరకెక్కిన అఖండ 2 సినిమా టికెట్ రేట్లను పెంచుతూ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం జీవో విడుదల చేసిన విషయం తెలిసిందే. దీనిని హైకోర్టు కొట్టివేసింది. సినిమా టికెట్ రేట్ల పెంపుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే న్యాయస్థానం తీర్పుపై డివిజన్ బెంచ్ స్టే విధించింది. దీంతో టికెట్ రేట్ల పెంపు అమలులోకి రానుంది. అయితే కోర్టు కేసుల నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి స్పందించారు. రాష్ట్రంలో టికెట్ రేట్లు పెంచబోమని స్పష్టం చేశారు.

## కాగ్నిజెంట్ కార్యాలయం ప్రారంభించిన మంత్రి లోకేశ్



**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సాఫ్ట్‌వేర్ కంపెనీలను రాష్ట్రంలో ఏర్పాటు చేసే వారికి ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఈ క్రమంలో పలు కంపెనీలు అక్కడ కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నాయి. విశాఖలో ఐటీ సంస్థ కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేసింది. దీనిని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ప్రారంభించారు. రుషికొండ ఐటీ పార్కులోని హిల్ 2పై మహతి ఫిన్‌టెక్ భవనంలో ఈ కార్యాలయం ఏర్పాటు చేశారు. వెయ్యి మంది కూర్చునే సామర్థ్యంలో దీనిని రూపొందించారు. ప్రారంభోత్సవంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అలాంటి రోజు వస్తుందనుకోలేదు: శోభిత



ప్రముఖ నటి శోభిత ధూళిపాళ్ల – నాగచైతన్య దంపతులు తమ తొలి వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఒక మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో వారు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. పెళ్లి తర్వాత జరిగిన అనేక విషయాలను శోభిత బహిరంగంగా పంచుకుంటూ.. "ఇలాంటి రోజు వస్తుందని అనుకోలేదు" అంటూ చెప్పిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. చైతూతో వివాహం తర్వాత ఎన్నో చేయాలనుకున్నాను. హైదరాబాద్ మొత్తం చుట్టేయాలనుకున్నాను. కానీ రెండు సినిమాలతో వరుసగా బిజీ అవ్వడంతో ఆ కోరిక నెరవేరలేదు. పెళ్లి అయిన వెంటనే దాదాపు 160 రోజుల పాటు షూటింగ్ కోసం తమిళనాడులో ఉండాల్సి వచ్చింది. పెళ్లి తర్వాత నా భర్తను విడిచి ఇంతకాలం దూరంగా ఉండాల్సి వస్తుందని అస్సలు ఊహించలేదు" అని చెప్పింది.

–అక్షరటుడే, సినిమా డెస్క్